ప్రజాశక్తి

బుధవారం 8 మే 2024 | 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పిడుగుపాటుతో నలుగురు దుర్మరణం

- మృతుల్లో తల్లీకూతుళ్లు, ఇద్దరు గొర్రెల కాపరులు
- పల్నాడు, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల భారీ వానలు
- విరిగిపడిన చెట్లు - విద్యుత్ సరఫరాకు అంతరాయం



మాచర్లలో వాన

ప్రజాశక్తి - క్రోసూరు, ముప్పాళ్ల

పల్నాడు జిల్లాలో మంగళవారం పిడుగుపడి నలుగురు దుర్మరణం పాలయ్యారు. వీరిలో ఇద్దరు తల్లీకూతుళ్ల కాగా, ఇద్దరు గొర్రెల కాపరులున్నారు. క్రోసూరు మండలం ఊటుకూరుకు చెందిన బొందల నాగేంద్రం (52), ఆమె కుమార్తె యండ్రపల్లి నాగరాణి (25) పొలం పనులకు వెళ్లారు. మొక్కజొన్న కండెలను వేరుచేసే పనిలో ఉండగా వర్షం రావడంతో ఇంటికి పయనమయ్యారు. అదేసమయంలో వారిపై పిడుగుపడడంతో ఇద్దరూ మృత్యువాత పడ్డారు. ముప్పాళ్ల మండలం కుందురువారిపాలేనికి చెందిన ఆవుల కోటేశ్వరరావు (45), అతని మేనల్లుడైన బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన జమ్ముల గోపి (35), మరికొంతమంది గొర్రెల కాపరులు కలిసి నరసరావుపేట మండలం ములకలూరు అగ్రహారం పొలాల్లో గొర్రెలు మేపుతున్నారు. సాయంత్రంవేళ ఒక్కసారిగా మేఘాలు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో కోటేశ్వరరావు, గోపి తమ గొర్రెలను తోలుకుని సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. కొద్దిసేపటికి చెట్టుపై పిడుగు పడడంతో ఆ ప్రభావానికి కోటేశ్వరరావు, గోపి అక్కడికక్కడే మృతి చెందారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు కాగా, గోపీకీ భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గోపీ తన జీవాలను మేపుకోవడానికి రెండ్రోజుల కిందటే వచ్చాడు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో 50 గొర్రెలూ మృతి చెందాయి.

నరసరావుపేటలో కుండపోత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణం, మండలం, రొంపిచర్ల మండలాలలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులు, వర్షం బీభత్సం 2లో



నాగేంద్రం, నాగరాణి మృతదేహాలు

వర్షంతో ఉపశమనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం నుంచి వర్షం ప్రారంభం కావడంతో వాతావరణం చల్లబడింది. రాత్రికి చల్లటి గాలులు వీచాయి. పలు మండలాల్లో ఆకాశం మేఘావృత్తమై కొన్ని ప్రాంతాల్లో రాత్రిపొద్దు పోయే వరకు చిరుజల్లులు కొనసాగాయి. పలు మండలాల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. గుంటూరు నగరంలో భారీ వర్షం కురిసింది. రహదారులపై నీరు పారింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వారం రోజులుగా వడగాల్పులు, ఎండ తీవ్రతతో అల్లాడిన ప్రజలకు చల్లటి వాతావరణం ఉపశమనం కలిగించింది. పల్నాడులో ప్రతిరోజూ 42 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న నేపథ్యంలో మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురవడం ప్రజలు ఊపిరి సేదదీరారు. వర్షంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

నేడు తాడేపల్లికి సీతారాం ఏచూరి రాక

జొన్నా శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ బహిరంగ సభ

ప్రజాశక్తి-తాడేపల్లి



ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం మంగళ గిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంట్ స్థానం సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లిలో బుధవారం బహిరంగ సభ జరగనుంది. సభకు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారు. ఈ మేరకు వివరాలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు తాడేపల్లి అమరారెడ్డిభవన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సాయంత్రం నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ఐదు గంటలకు జరిగే బహిరంగ సభకు తాడేపల్లిలోని వివిధ ప్రాంతాల నుంచి సిపిఎం శ్రేణులతో పాటు పేదలు పెద్దఎత్తున తరలి వస్తారని చెప్పారు. సభలో జిల్లా 2లో

పార్కింగ్ స్థలాలు

బహిరంగ సభకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఈ కింద సూచించిన ప్రదేశాల్లో తమ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సభ నిర్వాహకులు తెలిపారు. కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి, ఇప్పటం, వడ్డేశ్వరం, కొలనుకొండ నుంచి వచ్చే వాహనాలు కొత్తూరు రైల్వేగేట్ సమీపంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో వాహనాలను నిలుపుకోవాలి. ఉండవల్లి, పెనుమాక, కెఎల్‌రావు కాలనీ, సీతానగరం, సుందరయ్యనగర్ నుంచి వచ్చే వాహనాలు గణేష్ కళామందిరం వద్ద, మంగళగిరి వైపు నుంచి వచ్చే వాహనాలు మున్సిపల్ కార్యాలయం పక్కన రవీంద్రభారతి స్కూల్ సమీపంలో పార్కింగ్ చేసుకుని సభా స్థలికి చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.



నిత్యం పోరాడే కమ్యూనిస్టులను గెలిపించండి

- సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు
- కుంచనపల్లిలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌తో కలిసి ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజలకు సంక్షేమ పాలన అందించాలని, నిరంతరం పోరాటం చేసేది ఎర్రజెండా మాత్రమేనని, ఇండియా వేదిక తరుపున సిపిఎం మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం కుంచనపల్లిలో సిపిఎం, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రోడ్‌షో ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. ప్రధాన రహదారుల్లో ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా అభ్యర్థి శివశంకరరావు మాట్లాడుతూ పదవులున్నా, లేకున్నా ప్రజల పక్షాన నిలబడి నిరంతరం పోరాటం చేసేది ఎర్రజెండా 2లో



నియోజకవర్గం	7న పోలైన ఓట్లు	మొత్తం పోలైనవి
తాడికొండ	1047	1546
మంగళగిరి	1758	2380
పొన్నూరు	1149	1725
తెనాలి	1369	1950
ప్రత్తిపాడు	800	1397
గుంటూరు వెస్ట్	1950	2692
గుంటూరు ఈస్ట్	1351	2045
మొత్తం	9424	13735

గుంటూరులో ఓటు వేసేందుకు వేచి ఉన్న సిబ్బంది

9424 పోస్టల్ బ్యాలెట్లు పోలింగ్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో 9424 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. దీంతో ఇప్పటి వరకూ జరిగిన పోస్టల్ బ్యాలెట్లలో పోలైన ఓట్లు 13,735కు చేరుకున్నాయి. జిల్లాలో మొత్తం 20,755 పోస్టల్ బ్యాలెట్లు ఉండగా ఇప్పటి వరకూ 66.17 శాతం ఓట్లు పోలయ్యాయి. 5,6 తేదీల్లో పిఇఒలు, ఎపిఒలు, మైక్రో అబ్జర్వర్లకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. మంగళవారం ఓపిఒలకు నిర్వహించారు. ఓపిఒలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో ఉదయం 8 గంటల నుండే ఓటర్లు ఫెసిలేటషన్ సెంటర్లకు చేరుకున్నారు. కాగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటంతో ఓటర్లు కొంత అసౌకర్యానికి 2లో

అమరావతిపై ద్వంద్వ వైఖరి

నేటి విజయవాడలో రోడ్ షోలో మోడీ స్పందస్తారా?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

సుదీర్ఘకాలం తర్వాత బుధవారం విజయవాడ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ తన ఎన్నికల ప్రచార సభలో రాజధాని అమరావతిపై స్పందిస్తారా లేదా అన్న అంశంపై ఈ ప్రాంత వాసుల్లో చర్చ జరుగుతోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి తుళ్లూరు మండలం ఉద్దండ్రాయునిపాలెం గ్రామంలో 2015 అక్టోబరు 22న ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా నిర్మిస్తామని మోడీ



రాజధాని అమరావతి శంకుస్థాపనలో ప్రధాని మోడీ (ఫైల్)

ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే అదేరోజు నిధులపరంగా ఎటువంటి హామీ ఇవ్వలేదు. 2లో

పత్తిబోరేల మధ్య రూ.40 లక్షలు

తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ఖాళీ పత్తిబోరాల మధ్యలో గోతంలో చుట్టుకుని తీసుకెళ్తున్న రూ.40 లక్షలను స్పెషల్ స్క్వాడ్ బృందం మంగళవారం స్వాధీనం చేసుకుంది. ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు వివరాల ప్రకారం.. గుంటూరు డిఎస్ నగర్ ఏటుకూరు రోడ్డుకు చెందిన లారీ డ్రైవర్ నాగుమల్లి రమణయ్య 2లో

167 లీటర్ల మద్యం, నగదు సీజ్

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించి ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు మంగళవారమూ కొనసాగాయి. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రూ.6,230 విలువైన 3.1 లీటర్ల మద్యం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో రూ.1,04,840 విలువైన 142.52 లీటర్ల మద్యం, తాడికొండ నియోజకవర్గ పరిధిలో రూ.1,05,000 నగదు, పొన్నూరు నియోజకవర్గ పరిధిలో రూ.15,860 విలువగల 21.96 లీటర్ల మద్యం సీజ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.3 కోట్ల 19 లక్షల 49 వేల 811 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశారు.

9424 పోస్టల్ బ్యాలెట్లు పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

గురయ్యారు. ఒక్కొక్కరు ఓటు వేయటానికి 10 నుండి 15 నిముషాల సమయం పడుతుంది. దీంతో ఆలస్యం జరిగింది. కావున ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. కొద్ది మందికి డ్యూటీ ఆర్డర్‌లో పేర్కొన్న ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయాలని ప్రయత్నించగా అక్కడ ఓటు లేదని చెప్పటంతో నిరాశ వ్యక్తం చేశారు.

గుంటూరు తూర్పులో 1147 పోస్టల్ బ్యాలెట్లు

గుంటూరు తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు కేటాయించబడిన ఓపిఓలు మంగళవారం పెద్ద సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. స్థానిక ఏసీ కాలేజిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో వరుసగా 3వరోజు పోస్టల్‌బ్యాలెట్‌లో 1147 మంది ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా, హెల్ప్‌డెస్కులు, అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. ఫెసిలిటేషన్ సెంటర్‌ని పరిశీలించి, పోస్టల్ బ్యాలెట్‌కి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకూ జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో నియోజకవర్గ పరిధిలోని 1723 మంది వినియోగించుకున్నారు.

గుంటూరు పశ్చిమలో 1950 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

స్థానిక ప్రభుత్వ ఉమెన్స్ కాలేజిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మంగళవారం 1494, ఇతర జిల్లాలకు సంబంధించి 456 కలిపి 1950 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్ అయ్యాయి. దీంతో గత మూడు రోజులుగా జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో జిల్లాలో 2095 ఓట్లు, ఇక్కడ విధులు నిర్వహిస్తూ, ఇతర జిల్లాలకు సంబంధించి పోల్ అయిన 597 పోస్టల్ బ్యాలెట్లతో కలుపుకొని 2692 ఓట్లు పోల్ అయ్యాయి.

ప్రజాశక్తి - మాచర్ల

మూడవ రోజు కూడ ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగినట్లు రిటర్నింగ్ అధికారి, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం 1,020 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. సోమవారం 544 మంది అత్యవసర సర్వీసుల వారు వినియోగించుకున్నారని చెప్పారు. 247 మంది ఇతర జిల్లాల వారు ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. మంగళవారం 405 మంది ఓటింగ్‌లో పాల్గొన్నగా మొత్తం 2,216 మంది ఓటు హక్కుని వినియోగించుకున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా హోం ఓటింగ్ కోసం నమోదు చేసుకున్న వారికి బుధవారం 8 బృందాల ద్వారా ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామని ఆర్‌ఒ చెప్పారు. 162 మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మూడో రోజైన మంగళవారం ప్రశాంతంగా జరిగింది. సత్తెనపల్లి పట్టణంలోని జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో అధికారులు పెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులతోపాటు మొదటి రెండ్రోజుల్లో పోస్టల్ బ్యాలెట్ వినిగించుకోని వారు ఓటుహక్కును వినియోగించుకున్నారు. 397 మంది ఓటేశారు. వీరిలో 362 మంది సత్తెనపల్లి నియోజకవర్గంలో ఓటున్న వారు, 35 మంది ఇతర జిల్లాలో ఓటు హక్కు వున్న వారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

పిడుగుపాటుతో నలుగురు దుర్మరణం



(మొదటి పేజీ తరువాయి)

సృష్టించాయి. వినుకొండ, పల్నాడు, సత్తెనపల్లి, రొంపిచర్ల మార్గాలలో ఈదురు గాలుల తీవ్రతకు ఎండిపోయిన చెట్ల కొమ్మలు విరిగిపడడంతో వాహన రాజపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు కొమ్మలు విద్యుత్ తీగలపై పడి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. ప్రస్తుతం పొలాలలో కూరగాయలు, నువ్వులు సాగు చేశారు. ఆపంటలకు నష్టం వాటిల్లకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. 20 నిముషాల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి జనం ఉపశమనం పొందారు. మరోవైపు పశు గ్రాసం లేక ఇబ్బంది పడుతున్న పశువులకూ ఈ వర్షం వల్ల గ్రాసం కొరత తీరుతుందని పాడిరైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలో మేఘాలు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగుల ధాటికి పొలాల్లోని పాడి రైతులు భయాందోళనకు గురయ్యారు. బావుల కింద వేసిన మొక్కజొన్న పొలంలో ఉండడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు టార్పాలిన్ పట్టలు పట్టుకుని ఉరుకులు పరుగులు పెట్టారు. చాగంటివారిపాలెం శివారు జంగుంట వద్ద భారీచెట్లు రోడ్డు మీద పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్‌ఐ హజరతయ్య స్పందించి దాన్ని తొలగింపజేశారు. ముప్పాళ్లలో డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్డు మీదకి ప్రవహించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో ఉరుములు మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్



సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ, నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులో వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తొలుత ఈదురుగాలులు ప్రారంభం కాగానే విద్యుత్ సరఫరాను నిలిపేశారు.

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మాచర్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షం పడటంతో ఒక్క సారిగ వాతావారణం చల్లబడింది. స్థానికులు ఆరుబయటకు వచ్చి సేదదీరారు. ప్రతిరోజూ 42-46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతున్న పరిస్థితుల్లో రెండ్రోజులుగా సన్నటి జల్లులు పడటంతో వాతావరణంలో వేడి తగ్గి జనం ఉపశమనం పొందారు.

నిత్యం పోరాడే కమ్యూనిస్టులను గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదల సమస్యలపైన వామపక్ష పార్టీలు నిరంతరం పోరాడుతున్నాయని గుర్తు చేశారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, అవినీతి రహిత పరిపాలన అందిస్తామనే వాగ్దానాలతో కేంద్రంలో అధికారం చేపట్టిన బిజెపి, మోడీ నేడు ఎలక్ట్రోల్ బ్రాండ్ల కుంభకోణానికి పాల్పడ్డారని అన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించేలా మూడు నల్ల చట్టాలను తేగా రైతులు తమ ఉద్యమం ద్వారా తిప్పికొట్టారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని అమ్మేస్తున్న బిజెపి కబంధహస్తాల నుండి దేశాన్ని కాపాడేందుకు వామపక్ష పార్టీలు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, లౌకిక శక్తులతో కలిసి ఇండియా వేదికగా ఏర్పడ్డాయని చెప్పారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపితో జతకట్టిన టిడిపి, జనసేన, లోపాయికారిగా అంటకాగుతున్న వైసిపిలను ఓడించాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, గుంటూరు ఎంపీగా సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్‌కె సలీం మాట్లాడుతూ ప్రజల మధ్య కుల, మత చిచ్చు పెడుతున్న బిజెపిని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని చెప్పారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రైతు, కార్మిక, స్థానిక సమస్యల పైన పోరాటాలు నడిపిన జొన్న శివశంకరరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుత ప్రచారాన్ని కాపు సంఘం నాయకులు వై.హనుమంతరావు ప్రారంభించారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.నళినీకాంత్, మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి మండల అధ్యక్షులు పఠాన్ సుభాని, సిపిఎం నాయకులు బి.ముత్యాలరావు, జె.రాజ్ కుమార్, ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, పి.కృష్ణ, కె.సాంబశివరావు, ఎస్.కె గన్, బి.సంసోను, ఎ.రామారావు, ఎ.సుబ్బారావు, ఎ.ఉమామహేశ్వరరావు, బి.గోపిరెడ్డి, ఎ.నాగిరెడ్డి, పి.భార్గవ్ పాల్గొన్నారు.

నేడు తాడేపల్లికి సీతారాం ఏచూరి రాక

(మొదటి పేజీ తరువాయి)

సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే వేదిక ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. నెహ్రూ బొమ్మ సెంటర్‌లో విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. మరోవైపు సభ జయప్రదం కోసం ఎమ్మెల రామయ్య కాలనీ, ప్రకాష్‌నగర్, బోసుబొమ్మ సెంటర్, ముగ్గురోడ్డు, యాదవపాలెం, పుష్కరకాలనీ, అంజిరెడ్డికాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారంతోపాటు సమావేశాలు నిర్వహించారు. నాయకులు పి.దుర్గారావు, ప్రభాకర్, ఇక్బాల్, రాజ్యం, శారద, తులసమ్మ, ఎం.సూర్యారావు, డి.శ్రీనివాస కుమారి, జి.సుబ్బారెడ్డి, డి.విజయలక్ష్మి, సిహెచ్.వెంకటరత్నం, డి.విజయ్, కె.బాబూరావు, వై.శ్రీనివాసరావు, ఫిరోజ్, ఎస్.ముత్యాలరావు, పాల్గొన్నారు.

పత్తిబోరేల మధ్య రూ.40 లక్షలు

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన లారీలో పత్తిబోరేలను సోమవారం లారీలో తెచ్చి ఏటూకూరు హైవే సమీపంలోని ఓ మిల్లులో అన్‌లోడ్ చేశారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం ఖాళీ పత్తిబోరేలతో ఆత్మకూరుకు లారీనీ తీసుకెళ్తున్నారు. అయితే లారీలో డబ్బును తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న స్పెషల్‌స్క్వాడ్ బృందం లారీని వెంబడించింది. నడింపాలెంలోని జాతీయ రహదారిపై హైవే చెక్ పోస్ట్ సమీపంలో లారీని నిలిపేసి అధికారి శోభారాణి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టగా ఖాళీ గోతాల మధ్యలో డబ్బులు చుట్టిన పట్టా కనిపించింది. నగదును స్వాధీనం చేసుకున్నారు. నగదు లావాదేవీలకు సంబంధించి వివరాలు, ఆధారాలేమీ లేకపోవడంతో ఆదాయపన్ను శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి డ్రైవర్ నుండి వివరాలు సేకరించారు.

అమరావతిపై ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని నిర్మాణానికి కేవలం రూ.1500 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. ఈనిధులతో అప్పటి సిఎం చంద్రబాబు నాయుడు తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలు మాత్రమే నిర్మించారు. ఇంతకు మించి నిధులు ఇవ్వడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ససేమిరా అంది. దాదాపు లక్ష కోట్ల అంచనాలతో అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని నిర్మాణంపై ప్రణాళికలు రూపొందించింది. ఇవ్వన్నీ కార్యరూపం దాల్చలేదు. నవ నగరాలు ఏర్పాటు చేస్తామని టిడిపి ప్రభుత్వం ప్రకటించింది. ఆ పేరుతో వేల ఎకరాలను రైతుల వద్ద నుండి తీసుకున్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములను రైతులు ఇచ్చారు. కానీ వారికి ఇంత వరకు రిటర్నబుల్ ప్లాట్లు దక్కలేదు. కాగితాల్లోనే ఈ ప్లాట్లు ఇచ్చినా అభివృద్ధి చేసి ప్లాట్లు అప్పగించలేదు. ఎపి సిఆర్‌డిఎ చట్టం ప్రకారం మొదటి మూడేళ్లలోనే రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించాల్సి ఉన్నా టిడిపి హయంలో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాతనైనా ఈ ప్రక్రియ కొనసాగుతుందని రైతులు ఆశించారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతి అభివృద్ధి ఆగిపోయింది. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో సిఎం జగన్ మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగున్నరేళ్లపాటు మూడు రాజధానులకు వ్యతిరేకంగా, ఏకైక రాజధానిగా అమరావతి కొనసాగించాలని కోరుతూ రైతులు 1600 రోజులపాటు సుదీర్ఘకాలం ఉద్యమం నిర్వహించారు. రెండుసార్లు పాదయాత్రలు చేశారు. ఈ ఉద్యమాన్ని ఢిల్లీ వీధుల వరకు తీసుకువెళ్లారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని స్పష్టం చేశాయి. వైసిపి మాత్రం మూడు రాజధానుల నినాదం కొనసాగిస్తోంది. ప్రస్తుత ఎన్నికల్లో వైసిపి గెలిస్తే మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని, తన ప్రమాణ స్వీకారం విశాఖలోనే జరుగుతుందని సిఎం జగన్ ఇప్పటికే ప్రకటించారు. ఈమేరకు మేనిఫెస్టోలో కూడా ప్రస్తావించారు. రైతుల ఉద్యమాన్ని భేఖాతరు చేస్తూ వైసిపి తన మేనిఫెస్టోలో మూడు రాజధానుల అంశానికి ప్రాధాన్యత ఇచ్చింది. మూడు రాజధానుల అంశంపై గత నాలుగున్నరేళ్లుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని అవలంభిస్తూ వచ్చింది. ఓ వైపు రాజధాని అమరావతికి అనుకూలమేనని బిజెపి నాయకులు చెబుతు ఒడగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం న్యాయ స్థానాల్లో అందుకు భిన్నంగా అఫిడవిట్లు దాఖలు చేసింది. రాజధాని అంశం ఆ రాష్ట్రానికి సంబంధించిందని హైకోర్టు, సుప్రీంకోర్టులకు కేంద్ర హోం శాఖ తెలిపింది. దీంతో వైసిపి ప్రభుత్వం మూడు రాజధానులపై మరింత మొండిగా ముందుకెళ్లింది. ప్రధాని శంకుస్థాపన చేసిన రాజధానిని పూర్తి చేయాలన్న సంకల్పం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పెద్దలకూ లేకుండాపోయింది. ప్రధాని హామీ ఇచ్చినట్లు ప్రపంచ స్థాయి కాదు కదా కనీసం సాధారణ స్థాయి రాజధాని నిర్మాణం కూడా జరగలేదు. దీంతో రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరుకుంటున్న అసంపూర్తి భవనాలతో ఆ ప్రాంతం శ్మశానాన్ని తలపిస్తోంది. ఇందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని మోడీ ప్రధాన బాధ్యత వహించాల్సి ఉంటుంది. తెలంగాణ ఎన్నికలకు ముందు అమరావతిలోని రాజధాని గ్రామాల్లో బిజెపి పాదయాత్ర చేసి హైదరాబాద్‌లో సెటిలర్స్ ఓట్ల కోసం ఎత్తుగడ వేసింది. కానీ తెలంగాణాలో కూడా ఆశించిన ఫలితాలు పొందలేక పోయింది. రాజధాని అంశంపై కేంద్ర ప్రభుత్వం... వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడంపై అమరావతి రైతులు అసంతృప్తితో ఉన్నారు. ఇంత జరిగినా టిడిపి, జనసేన పార్టీలు ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ బిజెపితో పొత్తుపెట్టుకోవడాన్ని రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ అమరావతికి అనుకూలంగా ప్రకటన వస్తుందా రాదా అని రాజధాని ప్రాంత ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి
గుంటూరు, పల్నాడు
3
బుధవారం 8 మే 2024

పెదకూరపాడు అభివృద్ధి రాజధాని అమరావతి మాత్రమే

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు అభివృద్ధి రాజధాని అమరావతి ఆధారపడి ఉందని పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి అసెంబ్లీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మంగళవారం పెదకూర పాడులో ఎన్నికల ప్రచార నిర్వహించారు. జోరునవర్షంలో కూడా ర్యాలీ, ప్రచారం కొనసాగించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగాలు రావాలన్నా అమరావతిగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీల రక్షణగా ఉండేది తెలుగుదేశం మాత్రమే అన్నారు.



టిడిపి నాయకులు ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి

సంక్షేమ పథకాలు అందించింది కూడా చంద్రబాబు నాయుడు మాత్రమే అన్నారు. పెదకూరపాడు లో అభివృద్ధి చేసింది, రోడ్లు వేసింది తెలుగుదేశం పార్టీ మాత్రమే అన్నారు. మీ ఆస్తులు కాపాడుకోవాలన్నా, మీ భూములు మీకు దక్కాలన్న టిడిపికి ఓటు వేయాలన్నారు. ఇప్పటి వరకు జగన్ ప్రభుత్వ ఆస్తులు అమ్మకాలు తాకట్లు పెట్టిందన్నారు. ఇప్పుడు ప్రజల ఆస్తులపై కన్ను పడిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రమేషు, నాయకులు బుజ్జి, పెదకూరపాడు సర్పంచి గుడిపూడి రాజు, మహిళా నేతలు పటాన్ నూర్జహాన్, పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గుంటూరు అభివృద్ధికి కృషి : గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గుజ్జనగుండ్ల అభివద్ధికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గల్లా మాధవి హామీ ఇచ్చారు.మంగళవారం 39,42,43వ డివిజన్ లలో గుజ్జనగుండ్ల, బొడ్రాయి సెంటర్, సాయి కష్ణ నగర్, సుగాలీ కాలనీ,యస్.వి యన్ కాలనీలో గళ్ళా మాధవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డివిజన్ లో వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయని రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ కూడా సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేశారు సాధారణంగా ప్రజలు సంక్షేమంతో పాటు అభివద్ధి కూడా



గుజ్జనగుండ్లలో ప్రచారం చేస్తున్నగల్లా మాధవి

కోరుకుంటారని వైసిపి ప్రభుత్వం అభివృద్ధిని మరిచి పోయిందన్నారు. టిడిపి హయంలోనే గణనీయ మైన అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివద్ధి సంక్షేమ వైపు నడిపి ఏకైక నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అని మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమలో వైసిపికి ఓటమి భయం పట్టుకుందని, అందుకనే పోస్టల ఓట్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఉద్యోగులను బెదిరిస్తున్నారని గల్లామాధవి ఆరోపించారు. ఉద్యోగులకు డబ్బు ఎరవేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సింగంశెట్టి వీరయ్య,షేక్ మీరాబీ, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, లంకా ఉదయ్, కొమ్మినేని కోటేశ్వరావు, జమ్ముల వీరాంజనేయులు, వడ్లమూడి వెంకటేశ్వరావు, బెజవాడ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ మంత్రి ధర్మరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు 21వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మి డీలక్స్ ప్రాంగణంలో నెలకొన్న విగ్రహానికి ధర్మారావు సోదరులు ఆలపాటి మాధవరావు, ఆలపాటి ప్రసాద్, ఎం దశరథ రామిరెడ్డి, జెట్టి అంకినీడు మూర్తి తదితరులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో మాధవరావు మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పనిచేసి మంచి నాయకుడిగా ప్రజా మన్ననలు పొందారన్నారు.

కరెంటు తీగలపై వేలాడుతున్న చెట్లు

ప్రజాశక్తి - పొన్నూరు : పొన్నూరు పట్టణం ఆలూరు రోడ్డున నిత్యం వాహనదారులు పాతచారులు రద్దీగా ప్రయాణించే మార్గంలో మంగళవారం సాయంత్రం బలంగా ఈదురు గాలులు వీయడం తొ చెట్లు విరిగి కరెంటు తీగలపై రోడ్లకు అడ్డంగా పడినవి. ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది.సమస్యను పరిష్కరిస్తున్నారు.

రాజధాని రైతుల ప్రచారం

ప్రజాశక్తి - తుళ్లూరు

కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్ర శేఖర్, తెనాలి శ్రావణ్ కుమార్ లను గెలిపించాలని కోరుతూ రాజధాని రైతులు,మహిళలు,దళిత జెఎసి నాయకులు స్థానిక 7,8,9,10 వార్డుల్లో మంగళవారం రాత్రి ప్రచారం చేశారు.టిడిపి కార్యాలయం దగ్గర నుంచి ప్రచారం ప్రారంభించారు.కూటమి గెలుపుతో రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతుందని రైతులు ఓటర్లకు విన్నవిస్తున్నారు. గుంటూరు పార్లమెంట్,తాడికొండ అసెంబ్లీ కూటమి అభ్యర్థులు పెమ్మసాని చంద్ర శేఖర్, తెనాలి శ్రావణ్ కుమార్ కు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్ధించారు.

రెండు వార్డుల్లో మనోహర్ ప్రచారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో కూటమి తెనాలి నియోజకవర్గ జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గెలిపించాలని కోరుతూ స్థానిక 37, 38 వార్డులో మంగళవారం ప్రచారం నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టోలో ఆరు పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంచారు. గ్లాస్ గుర్తుపై ఓటేసి పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక తెనాలి నియోజకవర్గం అభ్యర్థిగా తనని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కూటమి కార్యకర్తలు, నాయకులు నాదెండ్ల వెంట ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పై గందరగోళం

-సరైన సమాచారం ఇవ్వని ఎన్నికల అధికారులు

-ఉద్యోగుల్లో గందరగోళం

గంటల తరబడి నిరీక్షణ

ప్రజాశక్తి - తెనాలి

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించినప్పటికీ ఫెసిలిటేషన్ సెంటర్లలో కనీస సమాచారం లభ్యం కావడం లేదు. ఎన్నికల అధికారుల సైతం స్పష్టమైన సమాచారం ఇవ్వటం లేదు. ఫలితంగా ఉద్యోగులు గంటల తరబడి క్యూలో నిలబడి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తెనాలి నియోజకవర్గంలో ఓటరుగా ఉండి వివిధ ప్రాంతాలలో ఉద్యోగం చేస్తూ, మరో జిల్లాలో ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్కు అప్లై చేసుకున్నప్పటికీ, తనకు ఓటు ఉన్న నియోజకవర్గంలో ఫారం 12 సమర్పించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. దాని ప్రకారం పలు నియోజకవర్గాలలో పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ కి దరఖాస్తు చేసుకున్నప్పటికీ, తెనాలి నియోజకవర్గంలో ఓటు ఉండటంతో ఫెసిలిటేషన్ సెంటర్ కు ఉద్యోగులు వచ్చారు. ఓపిఓగా విధులకు కేటాయించబడిన సిబ్బంది సోమ, మంగళవారాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించు కునేందుకు ప్రయత్నిస్తే, వారికి అధికారులు సరైన సమాధానం కూడా ఇవ్వలేదు. ఇతర ప్రాంతాలలో పోస్టల్ బ్యాలెట్కు అప్లై చేసినా ఇక్కడ కూడా ఫారం 12 సమర్పించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు అని చెప్పి రెండు రోజులు కాలయాపన చేశారు. చివరికి పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న ప్రాంతంలోనే ఉద్యోగులు ఓటు వేయాలని చెప్పడంతో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉద్యోగులు నిరాశతో వెనుదిరిగారు. కొందరు పోస్టల్ బ్యాలెట్కు దరఖాస్తు చేసుకున్న ప్రాంతానికి వెళ్లి ఓటు వేయగా, మరికొందరు ఎండ తీవ్రతకు విసుగుచెంది తిరిగి వెళ్ళారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా అమలు చేయకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరారు.



తెనాలిలో బారులు తీరిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

వాహన చోరుడికి దేహశుద్ధి

అనంతరం పోలీసులకు అప్పగింత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రకాష్ నగర్ లోని ఎస్.బి.ఐ ఏడిబి బ్యాంక్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపి బ్యాంక్ లోపలకి వెళ్లి బయటకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై కూర్చుని తాళం తీసేందుకు యత్నిస్తున్న యువకునికి ద్విచక్ర వాహన యజమానితో పాటు స్థానికులు దేహశుద్ధి చేశారు. కాళ్ళు చేతులు కట్టి ఆటోలోకి నెట్టి పడేసి 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో అప్పచెప్పారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వెంగళరెడ్డి నగర్ కాలనీకి చెందిన యువకుడు కొంత కాలంగా చెడు వ్యసనాలకు బానిసై సులభ మార్గంలో డబ్బు సంపాదించాలని ద్విచక్ర వాహనాల అపహరంణను ఎంచుకున్నారు. ద్విచక్ర వాహనం అపహరించడం రూపురేఖలు మార్చి తక్కువ ధరకు విక్రయించడం ఆ డబ్బుతో జల్సా చేయడం అలవాటుగా మార్చుకున్న యువకులు కొంత మంది ముఠాగా ఏర్పడి పట్టణంలో ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకొని పట్టణంలో ద్విచక్ర వాహనాల అపహరణను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పొలాల్లో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి తెనాలి :రూరల్ గ్రామం కఠెవరం పొలాలలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గ్రామస్తుల సమాచారంతో ఘటనా స్థలిని పరిశీలించిన రూరల్ పోలీసులు అక్కడ దొరికిన ఫోన్ ఆధారంగా మతుడు ఝార్ఖాండ్ రాష్ట్రానికి చెందిన సొరెన్ విజయ్ కుమార్ (39)గా నిర్ధారించి బంధువులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ సర్పంచ్ కారు దహనం

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ళ గ్రామ మాజీ సర్పంచ్ మోదుగుల నరసింహారావుకు చెందిన కారును గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. నరసింహారావు సోమవారం నరసరావుపేట వెళ్లి పనులు ముగించుకొని అనంతరం కారు(మారుతి ఆల్టో 800)ను ఇంటి సమీపంలోని ఖాళీ ప్రదేశంలో రోజు మాదిరిగానే పార్క్ చేశారు. మంగళవారం తెల్లవారు జామున కారు నుండి మంటలు పెద్దగా వ్యాపించడంతో స్థానికులు గమనించి నరసింహారావుకు సమాచారం అందించారు. వేగంగా వ్యాపించిన మంటలతో కారు కాలి బూడిదయింది. ఎస్ఐ షేక్ మహమ్మద్ ఫిరోజ్ సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి ఆ ప్రదేశంలో సీసీటీవీ ఫుటేజ్ లో వీడియోలను పరిశీలించగా ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి అనుమానాస్పదంగా ఉండటాన్ని గుర్తించారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్, క్లూస్ బృందాలు కారు తగలబడిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి - తాడికొండ : మండలంలోని చలపతి కళాశాల లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉద్యోగస్తులు భారీగా చేరుకున్నారు. లైన్లో నిలబడి ఓటు వేసే సమయానికి మీ ఓటు లేవంటూ ఎన్నికల అధికారులు చెప్పడంతో అధికారులకు, ఓటర్లకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫారం 12, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు జత చేసి ఆర్ఓ ధ్రువీకరిస్తే ఓటు వేసే అవకాహం ఉన్నపటికీ మేము కలెక్టర్ కార్యాలయానికి పంపుతాము రేపు రండని ఆర్ ఓ సమాధానం ఇస్తున్నారని, దూర ప్రాంతాల నుంచి వచామని, ఓటు వేసి వెళతామని వారు అన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి నియోజకవర్గం లో విధులు నిర్వహిస్తున్న ఇతర జిల్లాల కు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఓట్లు లేవని మంగళవారం మంగళగిరి నిర్మల హైస్కూల్లో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద అసహనం వ్యక్తం చేశారు. గత రెండు రోజులుగా పోలింగ్ కేంద్ర వద్ద ఉద్యోగులు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నా రు. మంగళవారం ఓ పి ఓ ఉద్యోగులు 500 మంది, పోలీసులు 435 మంది మొత్తంగా 1500 మంది ఓటు హక్కు వినియోగించు కోవలసి ఉంది. అందరూ ఒక్కసారిగా రావడంతో గందరగోళం ఏర్పడింది. వెంటనే నియోజవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి కలగజేసుకొని ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. అన్ని ఓట్లు ఉన్నా యని గందరగోళ పడాల్సిన అవసరం లేదని అన్నారు. మొత్తంగా ఇక్కడ 2,950 ఓట్లు ఉన్నాయని, అందులో ఇతర జిల్లాలక చెందిన వారి 1600 ఉన్నాయని చెప్పారు. అందరికీ ఓట్లు ఉన్నాయని తెలిపారు. పారం 12 దరఖాస్తు చేసుకొని అవసరమైతే విధులు నిర్వ హించే పోలింగ్ కేంద్రంలోనైనా ఓటు వేసుకోవచ్చని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
గుంటూరు జిల్లా
పల్నాడు జిల్లా

మంగళగిరిలో ఓటుకు నోటు ఆట ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అధికార పార్టీ తరపున మురుగుడు లావణ్య పోటీ చేస్తున్నారు. పోలింగ్ తేదీకి ఐదు రోజులు ముందుగానే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని, అధికార పార్టీ అభ్యర్థి తరఫున, ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి నారా లోకేష్ తరపున ఓటుకు 3000 రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లుగా తెలిసింది. ముందుగా మగ్గం షెడ్‌లో నేత నేస్తున్న కార్మికుల నుండి ప్రారంభమైనట్లుగా తెలిసింది. ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ నోట్ల పంపిణీ మాత్రం అరికట్టలేక పోతున్నారు. ఎన్నికల అధికారులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతుందని విమర్శలు వస్తున్నాయి. ఈ నియోజకవర్గంలో గత రెండు సంవత్సరాల నుండి ప్రజలకు అవసరమైన వారికి పండ్లు, ఇస్త్రీ బండ్లు, పెళ్లి కానుకలు, రకరకాల పేర్లతో పంపిణీ చేయడం జరిగింది. పార్టీల్లో చేరికలు కూడా ప్యాకేజీలు మాట్లాడుకుని మారుతున్నట్లుగా సమాచారం.





నవులూరులో జొన్నా శివశంకరరావు రోడ్‌షో

ఆస్తులు స్వాహా చేసేందుకు పన్నాగం

పొన్నూరు ర్యాలీలో పెమ్మసాని చంద్రశేఖర్



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజల ఆస్తులను కాజేసేందుకు వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చారని టిడిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి చంద్రశేఖర్ పొన్నూరు పట్టణంలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పట్టణంలోని గల మున్సిపల్ ఆఫీస్ నుంచి ప్రారంభమైన పర్యటన షరాఫ్ బజార్, ఐలాండ్ సెంటర్, నిడుబ్రోలు, రైల్వే స్టేషన్ రోడ్డు, చేనేత కాలనీ మీదుగా ర్యాలీ కొనసాగింది. వర్షంలోనే ర్యాలీ కొనసాగింది. వర్షాన్ని కూడా లెక్క చేయక ముందుకు సాగుతున్న ఆ ఇరువురు నాయకులను చూసేందుకు, పలకరించేందుకు ప్రజలు కూడా విరివిగా పర్యటనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐలాండ్ సెంటర్‌కు పర్యటన చేరుకున్న అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రజల మీదకు ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రయోగిస్తుందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రజల భూములు, పొలాలు ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. తొలత పాస్ పుస్తకాల్లో ఫోటోలు, తర్వాత సర్వే రాళ్లపై ఫోటోలు, ఇప్పుడు ఏకంగా ప్రజల ఆస్తుల దస్తావేజులు ప్రభుత్వం వద్ద ఉంచడం అంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఎక్కడ అని ప్రశ్నించారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసి రైతులను తీవ్రంగా క్షోభకు గురి చేశారన్నారు. 33 వేల ఎకరాలను రైతులు ప్రభుత్వం చేతిలో పెడితే అక్కడ రాజధాని నిర్మించడం ఈ జగన్ కు చేతకాలేదు. నలుగురు కడుపునిండా అన్నం తినే అన్నా క్యాంటీన్లను రద్దు చేసిన ఈ జగన్ తనను తాను ప్రజాపక్షపాతి అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ వైసిపికి ఓటు వేస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదన్నారు. ఈ అరాచక పాలనకు, విధ్వంసక పరిపాలనకు అంతం పలుకుదామన్నారు. అంబటి రాంబాబు, మురళీ కార్పొరేటర్ ఏంటో ఆయన అల్లుడే చెప్పున్నారు. అలాంటి అంబటి వచ్చి క్రికెటర్ అంబటి రాయుడిని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. పొన్నూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, బిసి నాయకులు నిమ్మల శేషయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీగా గుంటూరును అభివృద్ధి చేస్తాం

వైసిపి గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపిస్తే గుంటూరు స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. స్థానిక 34వ డివిజన్ పరిధిలోని కోబాల్ట్ పేట, దేవాపురం, బ్రాడీపేట సెకండ్ క్రాస్ రోడ్డు, ఫాతిమాపురం తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసిపి అధికారంలోకి రాగానే గుంటూరుకు తగిన నిధులు కేటాయించి రహదారులను మెరుగుపర్చడం, యూజిడి పనులు పూర్తి చేయడం, ట్రాఫిక్ మేనేజిమెంట్, పార్కులు, ఇత సదుపాయాలతో స్మార్ట్ సిటీగా తయారుచేస్తామని చెప్పారు. అందుకోసం తొలి విడతగా రూ.2వేల కోట్లు కేటాయించేలా మేనిఫెస్టోలో ఇప్పటికే ప్రకటించామని పేర్కొన్నారు. మధ్య తరగతి వారి కోసం రూ.2వేల కోట్ల కార్పస్ ఫండ్‌తో ఎంఐజీ లే అవుట్లను పట్టణ ప్రాంతాల్లో దశల వారిగా నిర్మించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇల్లు లేని ప్రభుత్వ ఉద్యోగులకు వారి సొంత జిల్లాల్లోనే ఇళ్ల స్థలాలను 60 శాతం ఖర్చు తమ ప్రభుత్వమే భరిస్తూ పంపిణీ చేస్తుందని వెల్లడించారు. ఈ మేరకు ఇప్పటికే ఎన్నికల ప్రణాళిక ప్రకటించామన్నారు. ఏదైనా మాట ఇస్తే ఆ మాటను నిలబెట్టుకునే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లు తమ ప్రభుత్వం మరింత గొప్ప పాలన అందించబోతోందని చెప్పారు. ఎన్నికల సాకును అడ్డుపెట్టుకుని చంద్రబాబు పేదలకు వారి ఖాతాల్లో సంక్షేమ పథకాల డబ్బు జమకాకుండా అడ్డుకుంటున్నారని శాసనమండలి విప్ అప్పిరెడ్డి మండిపడ్డారు. రజనితో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎంతమందితో కూటమి కట్టినా ఇంకా గెలుస్తామనే ధ్యైర్యం చాలక జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని అధికారులను మార్పించడం, పథకాలకు డబ్బులు వేయనీయకుండా ఆపించడం వంటి కుట్రలకు పాల్పడుతున్నాడని ధ్వజమెత్తారు. వైసిపి నగర అధ్యక్షులు మద్దాలి గిరి మాట్లాడుతూ విడదల రజిని గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత, మాజీ కార్పొరేటర్ దేవానంద్, వైసిపి నాయకులు లాల్‌పురం రాము, గిరి రాము, రాయప్ప, భాగ్యరావు, గోపి, సైదా, వెంకటరత్నం, మేరుగ విజయ, ఉషారాణి పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థుల్ని గెలిపించాలి

ప్రజాశక్తి తెనాలి : దేశ సంపదను అదాని, అంబానీల లాంటి కార్పొరేట్లకు దోచిపెట్టి, మత విద్వేషాలను రెచ్చగొట్టి రాష్ట్రాన్ని దగా చేసిన మోడీని, ఆయనకు వంత పాడుతున్న టిడిపి, జనసేన బిజెపి కూటమిని ఓడించాలని భారత్ బచావో రాష్ట్ర కమిటీ చైర్మన్ చిగురుపాటి భాస్కరరావు పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ గత నెల 29 నుంచి చేపట్టిన ప్రచారంలో భాగంగా మంగళ వారం భారత్ బచావో బృందం తెనాలిలో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ పదేళ్ళ మోడీ పాలనలో అన్ని రంగాలు తిరోగమన దిశలో ఉన్నాయన్నారు. మీడియా విభాగం రాష్ట్ర కార్యదర్శి జివి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహెూదా ఇస్తామని తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రకటించిన మోడీ ఆ హామీని నిలబెట్టుకోకుండా రాష్ట్రానికి దగా చేశారన్నారు. 2014 నుంచీ బిజెపికి అన్ని విషయాల్లో వైసిపి, టిడిపి పార్టీలు రెండూ మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. పెనుముప్పు నుంచి రాష్ట్రాన్ని రక్షించగలిగిన రాజకీయ శక్తి 'ఇండియా' బ్లాక్ మాత్రమేనని, ఎన్నికల్లో ఇండియా బ్లాక్ బలపరిచిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థి శావల గోపాల్, మంగళగిరి సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు, గుంటూరు 1, గుంటూరు 2, ప్రత్తిపాడు, పొన్నూరు, తాడికొండలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు ఎస్కె మస్తాన్ వలి, రాచకొండ జాన్ బాబు, కొరివి వినయ్ కుమార్, జక్కా రవీంద్రబాబు, మంచాల సుశీల్ రాజు అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో కృష్ణా గుంటూరు జిల్లాల ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా నవజ్యోత్, యువజన కార్యదర్శి అందే శ్యామ్, జిల్లా కార్యదర్శి సమతా పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూపోరాటాలు

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి

ఎలక్షన్లప్పుడు దండాలు పెట్టి ఓట్లడిగిన వారు అనంతరం అదేజనం చేతులు జోడించి వేడుకున్నా వారి సమస్యలను పట్టించుకోరు.. పైగా రెక్కల కష్టం చేసి కట్టుకున్న గూళ్లను కూల్చేయాలని ఒక పార్టీవారు కోర్టుకెళితే ఇంకొపార్టీ వారు ఏకంగా కూల్చివేతలకే పాల్పడ్డారు.. ఇప్పుడు మళ్లీ అదే పార్టీలు వచ్చి మీకు మేమున్నాం.. ఓట్లేయండంటూ మోసపూరిత మాటలు చెబుతున్నాయి.. కమ్యూనిస్టులు అలా కాదు.. ఎక్కడైనా సమస్య ఉందని తెలిస్తే చాలు అక్కడ వాలిపోయి భారాన్నంతా తమ భుజాన వేసుకుని పేదల పక్షాన పోరాడారు.. జనాన్ని కూడగట్టి ఆందోళనలు చేసి అనేక సమస్యలను పరిష్కరించారు.. తాజాగా మంగళగిరి నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాల సమస్య ప్రధానంగా ముందుకు వచ్చింది. ఏళ్ల తరబడి సిపిఎం ఉద్యమాలు, పట్టువదలని పోరాటాలతో పేదలకు ఇళ్ల స్థలాలు దక్కగా ఆ ఇళ్లకు పట్టాల కోసం మరోదశ పోరాటమూ సిపిఎం చేపట్టింది. పట్టాలు వారి చేతిలో లేకపోయినా వాటిని సాధించే సత్తా మాత్రం ఆ పార్టీదేనని గత, వర్తమాన చరిత్ర చెబుతోంది.

గుంటూరు, విజయవాడకు మధ్యన ఉండే మంగళగిరి నియోజవర్గంలో చాలా ఏళ్ల కిందటే భూముల ధరలకు రెక్కలొచ్చాయి. సామాన్యులు సొంతంగా స్థలం కొని ఇల్లు కట్టుకోవడం అంటే మధ్యతరగతి వారికే ఒక కలగా ఉండేది. అదే పేదలకైతే మితిమీరిన ఆశగానే భావించేవారు. అద్దె ఇళ్లల్లో సరిపెట్టుకుందామనుకున్నా వచ్చే కూలి డబ్బులతో ఇల్లు గడవడమే గగనమవుతుంటే అద్దెలు చెల్లించడానికి పడే అవస్థలు అన్నీఇన్ని కావు. ఈ నేపథ్యంలో బీద, బిక్కివారిని సిపిఎం సమీకరించింది. ఇళ్ల స్థలాల కోసం అనేకసార్లు భూపోరాటాలు చేసింది. ఖాళీగా ఉన్న వివిధ రకాల ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంచింది. ఈ క్రమంలో పాలక పార్టీల నుండి తీవ్ర నిర్బంధాలు, పోలీసుల నుండి అణచివేతలనూ చవిచూసింది. అయినా ఎర్రజెండా నీడన సిపిఎం ఆధ్వర్యంలో పేదలంతా ఐక్యంగా నిలబడ్డారు. గుడిసెలను కూలిస్తే మళ్లీ వేసుకున్నారు. ఇళ్లను కూలుస్తుంటే ప్రతిఘటించారు. చివరికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లోని 20 వేల కుటుంబాలు తమ స్థలాలను, ఇళ్లను ఎర్రజెండా అండతో నిలబెట్టుకున్నాయి. ఏళ్ల తరబడి అదే నివాసాల్లో జీవనం సాగిస్తున్నారు. అద్దె భయం లేకుండా వచ్చిన రోజువారీ కూలి డబ్బులతో కాస్తయినా ప్రశాంతంగా బతుకుతున్నారు.

పోరాట ఫలం.. పేదలకు ఇంటి స్థలం

మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు, మంగళగిరి కొండ ప్రాంతంలో ఫారెస్ట్ భూమి, మూడో వార్డులో దేవాదాయ భూములు, పావురాల కాలనీ, మండలంలోని ఆత్మకూరులో నిమ్మగడ్డ రామ్మోహన్‌రావు నగర్, కాజా గ్రామంలో పుల్లయ్య నగర్, పెదవడ్లపూడి, రేవేంద్రపాడు కాల్వ గట్ల స్థలాలు, నూతక్కిలో చెరువు గట్లస్థలం, నిడమర్రు, కురగల్లు, బేతపూడి గ్రామాల్లో చెరువు గట్లపైన ఇళ్లు. ఈ ఇళ్ల నుండి పేదలను తరిమేయాలని, ఇళ్లను కూల్చేయాలని అధికారంలో ఉన్న ప్రతి పాలకపార్టీ యత్నించింది. పోలీసులు, అధికార యంత్రాంగాన్ని ఉసిగొల్పింది. ఇలాంటి ఉపద్రం వచ్చిన ప్రతిసారీ పేదలకు ఎర్రజెండానే అండయింది. ప్రతిఘటనే మార్గమైంది. ఇటీవల మంగళగిరి పట్టణంలోని గిరి ప్రదక్షణ రోడ్డు పేరుతో నాలుగో వార్డు ఎస్టీ కలనీలో ఇళ్లు కూల్చడానికి అధికార యంత్రాంగం రాగా సిపిఎం అడ్డుపడి ఇళ్లను నిలబెట్టింది. దేవాలయ భూమిలో మూడవ వార్డులో 225 మంది 70 ఏళ్లకుపైగా ఇళ్లేసుకుని జీవిస్తుంటే వాటిని తొలగించాలని గతంలో కోర్టులో టిడిపి కేసు వేసింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తాము అధికారంలోకి వస్తే ఈ ఇళ్లకు పట్టాలిస్తామని హామీనిచ్చి విస్మరించారు. ఇప్పుడు అదే హామీని టిడిపి ఇస్తోంది.

ఎన్నికలప్పుడు హామీలు - ఎన్నికలయ్యాక అరెస్టులు
ఎర్రజెండా అండతో నియోజకవర్గంలో పేదలకు ఇళ్లు - గ్రామాలను తలపిస్తున్న కాలనీలు
కూల్చివేత ప్రయత్నాల్లో పాలకపార్టీలు - పేదల పక్షాన నిలిచిన సిపిఎం నాయకులు


పేదల కాలనీ

మా ఇళ్లను కాపాడుతోంది సిపిఎం

నాగేశ్వరరావు, 3వ వార్డు



మూడో వార్డు దేవస్థానం భూమిలో ఇల్లేసుకుని మూడు తరాలుగా నివాసం ఉంటున్నాం. ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలు వచ్చి గెలిస్తే మీకు పట్టాలు ఇస్తాం.. అంటున్నారేగాని ఇవ్వడం లేదు. పైగా కొన్నిసార్లు తొలగించాలని చూస్తుంటే వాటిని కాపాడుతోంది సిపిఎం మాత్రమే.

అక్షరాల రూ.లక్షల లబ్ధి

మంగళగిరి పట్టణంలో ఇప్పటివరకు ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన సందర్భాలు లేవు. కమ్యూనిస్టుల పోరాటాల వలన ప్రభుత్వ భూముల్లో పేదలు ఇళ్లేసుకోగలిగారు. మంగళగిరి పట్టణంలో సుమారు 8 వేల కుటుంబాలు, రూరల్ మండలంలో రెండువేల కుటుంబాలు, తాడేపల్లి పట్టణంలో 10 వేల కుటుంబాల వరకూ ప్రభుత్వ భూముల్లో ఇళ్లేసుకుని ఉంటున్నారు. తద్వారా అనేక కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లిలో అద్దెకుండాలంటే చిన్న రేకుల షెడ్డు అయినా కనీసం రూ.3 వేలు అవుతుంది. ఈ లెక్కన సిపిఎం పోరాటం ద్వారా ఇల్లేసుకున్న ప్రతికుటుంబం ప్రతినెలా రూ.3 వేలు, ఏడాదికి రూ.లక్ష చొప్పున లబ్ధి పొందుతున్నట్టే. లేదా తమ కష్టార్జితాన్ని అద్దెలకు ధారపోయకుండా కాపాడుకుంటున్నారు. ఇదే స్థలాన్ని ఆస్తి రూపంలో లెక్కేస్తే ఒక్కో ఇంటి స్థలం రూ.10 లక్షలకు తక్కువ కాదు.

పట్టాల కోసం పట్టువదలక పోరాటం

ఇదంతా తేలిగ్గా వచ్చిందేమీ కాదు. లాఠీ దెబ్బలు, కోర్టు కేసులు, నిర్బంధాలు, అణచివేతలు ఎదుర్కొని సిపిఎం పోరాడింది.. ఇప్పటికీ ఆ ఇళ్లను కాపాడ్డం కోసం పట్టాలివ్వాలని పోరాడుతోంది. ఇళ్లను కూల్చడానికి ఎప్పుడెవరొస్తారోనని పేదలు నిత్యం ఆందోళనకు గురవుతూనే ఉన్నారు. ఆ ఉపద్రం వచ్చినప్పుడు ఎర్రజెండాను బుజానేసుకుని ఉద్యమిస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో అధికార వైసిపి, అధికారం కోసం తాపత్రయ పడుతున్న టిడిపి పేదలను మరోసారి మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యాయి. వారిని నమ్మి ఓటేస్తే ఏమవుతుంతో గత పదేళ్లలో కూల్చిన ఇళ్లే సాక్ష్యం. అందుకే ఇళ్ల స్థల పోరాటం నడిపిన సిపిఎంకు ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని, ఆ పోరాటంలో భాగస్వామి అయిన ఆ పార్టీ మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావును గెలిపించుకోవాలని పేదలు భావిస్తున్నారు.


పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొని..

తాడేపల్లి మండలంలో నులకపేటలోని సుందయ్య కాలనీ, సుందరయ్య ప్రెస్‌కాలనీ, ఎర్రగడ్డ, ఎమ్మెల రామయ్య కాలనీలో 500 కుటుంబాలు నివాసాలు ఏర్పర్చుకుని జీవిస్తున్నారు. ముఖ్యంగా రామయ్య కాలనీ ఏర్పాటు సందర్భంగా 850 ఇళ్లు ఎందుకు పనికి రాని ఫారెస్టు భూమిలో ఎర్రజెండా అండతో పేదలు వేసుకోగలిగారు. సిపిఎంకు పేరు వస్తుందని పాలకవర్గ పార్టీలు ఓ రోజు తెల్లవారుజామునే పెద్దఎత్తున పోలీసులకు దించి ఇళ్లను కూల్చివేశారు. పేదల ఆర్తనాదాలు కూడా అధికారుల చెవికి ఎక్కలేదు. మళ్లీ పోరాడి పేదలకు అక్కడే ఇళ్లు వేయించిన చరిత్ర సిపిఎంకు ఉంది. ప్రస్తుతం అక్కడ 400 మంది పేదలు నివశిస్తున్నారు. ఏడు సంవత్సరాల నుంచి సిపిఎం నాయకులు ఆనాడు అక్రమంగా పెట్టిన కేసుల నేపథ్యంలో నేటికీ కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. సిపిఎం నాయకులు నిమ్మగడ్డ రామ్మోహనరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1999లో కోర్టు నుంచి స్టే ఆర్డర్ తీసుకొచ్చారు. దీంతో ఆ ప్రాంతంలోని కాలనీలు అన్నింటికీ రక్షణ కవచంలాగా స్టే ఆర్డర్ ఉపయోగపడింది. ఈ సందర్భంగా 26 మందిపై కేసులు నమోదు చేశారు. స్టే ఫలితంగా శిదవుర్గాపురం, ఇస్లాంపేట, లెనిన్‌నగర్, జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులకు భరోసా ఏర్పడింది. తాడేపల్లి పట్టణంలో అమరారెడ్డినగర్‌లో 1986లోనే ఎర్రజెండా అండతో పేదలు ఇళ్లు వేసుకున్నారు. అప్పటి పాలకవర్గం నాయకత్వంపై కేసులు పెట్టింది. ఇళ్లు నిర్మించుకోవడానికి తెచ్చిన సామాగ్రిని పంచాయతీ కార్యాలయానికి తరలించి పాలకవర్గం పేదలను ఇబ్బంది పెట్టింది. కత్తులపేట, కెఎల్‌రావుకాలనీ, రన్నింగ్ రూమ్ సెంటర్, పాత చెక్‌పోస్టు, లంబాడీపేట, సుందరయ్యనగర్ తదితర ప్రాంతాల్లో వేలాది మంది ఇప్పటికీ నివాసం ఉంటున్నారు. బతుకు దెరువు కోసం ప్రస్తుతం పల్నాడు జిల్లా వినుకొండ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన అనేక మంది బడుగు జీవులకు తన మన తేడా చూపకుండా సిపిఎం ఇళ్ల స్థలాలు ఇప్పించింది. విజయవాడ నగరంలో అధిక అద్దెలు చెల్లించలేక ముఠా కార్మికులు అనేక మంది వచ్చి ఇక్కడ ఎర్రజెండా అండతో ఇళ్లు వేసుకున్నారు. సీతానగరం శివాలయం వీధి, సెటిల్‌మెంట్ ఏరియా, పంపు షెడ్డు, అమరారెడ్డికాలనీ, పోలకంపాడు, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో సిపిఎం అండతో పేదలు నిర్మించుకోగలిగారు. సంజీవయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లకు పట్టాలు కూడా సిపిఎం ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు సాకారంతో పేదలు సాధించుకోగలిగారు. వడ్డేశ్వరం గ్రామంలో సాగిన భూపోరాటంలో 75 మంది లబ్ది పొందారు. వీటన్నంటిలో అధికారుల వేధింపులు, కేసులు షరా మామూలుగానే జరిగాయి. చినకాకాని, కాజ గ్రామంలోని పులయ్యనగర్, ఆత్మకూరులోని గణపతినగర్, నిమ్మగడ్డ రామ్మోహనరావు నగర్, వడ్లపూడి కాలవగట్ల మీద మరో 500 వరకు కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా పుట్టిన ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ గ్యారెంటీ ఇవ్వాలని దానికి స్ఫూర్తిగా సిపిఎం భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇళు దక్కే విధంగా చేసింది. పాలకవర్గ పార్టీలు ఎప్పుడూ ఇళ్లు కూల్చే దానికి తప్ప ఇళ్లు వేయించే దానికి, పేదల గూడు నిలబెట్టే దానికి ప్రయత్నం చేయలేదు. మంగళగిరి నియోజకవర్గం పేరు చెప్పగానే పేదలకు ముఖ్యంగా గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులు, ఎర్రజెండా. దానికి అనుగుణంగానే వేలాది ఇళ్లు వామపక్షాల నేతృత్వంలో దక్కాయి. 13న జరుగుతున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థిగా పోటీ చేస్తున్న సిపిఎం మంగళగిరి అభ్యర్థి జొన్నా శివశంకరరావు ఆయా పేటలతో పాటు పేద ప్రజల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతుంది.

అద్దె ఇంట్లో ఉంటున్నాం : సుగుణ



మాకు ఇంటి స్థలం లేదు. సొంతంగా కొనే ఆర్థిక స్తోమతా లేదు. అందుకు నెలకు రూ.3 వేలు చెల్లిస్తూ అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఎన్నికలప్పుడు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతున్నారేగాని ఇవ్వడం లేదు. మాకు అద్దెల భారం తప్పడం లేదు. ఇంటి స్థలం ఇప్పించాలని కోరుతున్నాము.



మంగళగిరి నియోజకవర్గంలో సిపిఎం ఆధ్వర్యాన పెద్దఎత్తున భూపోరాటాలు జరిగాయి. పేదల గూడు కోసం సాగిన పోరాటం ఎర్రజెండా అండతో పేదలకు ఇళ్లు దక్కాయి. సిపిఎం వేయించిన కాలనీలు నేడు వేలాది మందితో గ్రామాలను తలపిస్తున్నాయి. పేదలకు ఇళ్లు వేయించడమే కాకుండా మౌలిక సౌకర్యాల కల్పనలో కూడా ఎర్రజెండా వారికి అండగా ఉంది. ఇళ్లు వేయించే సందర్భంగా పెట్టిన అక్రమ కేసులకు సిపిఎం నాయకులు వెరవక పేదల పక్షాన నిలబడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం కాలనీలో పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో 20 ఏళ్ల క్రితమే పేదలకు ఇళ్లు కావాలని ఉవ్వెత్తున ఉద్యమించిన చరిత్ర సిపిఎంది.

పట్టాల కోసం పోరాడి సాధిస్తాం

జొన్నా శివశంకరరావు, సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి



మంగళగిరి నియోజకవర్గంలో 20 వేల కుటుంబాలు ఇళ్ల పట్టాల కోసం నిరీక్షిస్తున్నాయి. సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే పలు పోరాటాలు నిర్వహించాం. ఎన్నికల్లో తనను గెలిపిస్తే చట్టసభలు, స్థానిక సంస్థల్లోనూ పోరాడి ఇళ్ల పట్టాలు సాధిస్తాం.

కమ్యూనిస్టులను చట్టసభలకు పంపించండి

మతోన్మాద తొత్తులకు తగిన గుణపాఠం చెప్పాలని నాయకుల పిలుపు - నవులూరులో సిపిఎం అభ్యర్థి జొన్నా రోడ్‌షోకు విశేష స్పందన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న మతోన్మాద బిజెపి దాని అంట కాగుతున్న టిడిపి, జనసేన, వైసిపి లకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సీపీఐ, కాంగ్రెస్ బలపరిచిన సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు నవులూరు గ్రామంలో మంగళవారం రోడ్డు షో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఇంటింట ప్రచారం నిర్వహించారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్ కు కంకి కొడవలి గుర్తు పై, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు సుత్తి కొడవలి చుక్క గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అభ్యర్థి జొన్న శివశంకర్, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సీపీఐ నాయకులు చిన్ని తిరుపతయ్య మాట్లాడారు. కేంద్రం లోని బిజెపి ఈడి నీ అడ్డం పెట్టుకొని వారికి వ్యతిరేకంగా ఉన్నటువంటి వారందరినీ అరెస్ట్ లు చేయడం జరుగుతుంది. బిజెపి నీ ఎవరు వ్యతిరేకిస్తూ ఉంటే వారిని , ముఖ్య మంత్రులు ను సైతం అరెస్ట్ చేసి జైళ్ల లో పెడుతున్నారన్నారు. రాష్ట్రం లోని టిడిపి, వైసిపి లు ప్రత్యక్షం గా, పరోక్షం గా బిజెపి వంత పాడుతున్నాయని, ప్రమాదకరమైన బీజేపీ నీ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. మత ఘర్షణలకు పాల్పడుతున్న బిజెపి సిఎఏ నీ రుద్దాలనీ చూస్తుందన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు జొన్న పై ప్రత్యేకంగా రూపొందించిన గేయాలని ఆలపించారు కార్యక్రమంలో నాయకులు ఎం. బాగ్యరాజు, ఆర్ వి సింహారావు, లక్ష్మణరావు, నంద్రు సురేష్, నికల్ సన్, కాసిం, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి లు దేవరకొండ శ్రీనివాసరావు, పెద్దిరాజు , సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, పాల్గొన్నారు

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజల కోసం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్, సిపిఎం మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివ శంకర్రావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మంగళగిరి పట్టణంలోని 10 వార్డు, 11 వార్డులలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి పత్తేవరపు వెంకట శివప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వర రావు, మంగళగిరి నియోజకవర్గ ఏరియా కమిటీ సభ్యులు అన్నవరపు ప్రభాకర్, సిపిఐ నాయకులు, నరసింహారావు, బాపనపల్లి వెంకటేశ్వరరావు, వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఏమైనా ముందుండి పోరాడే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని అలాగే సిపిఐ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ కు కంకి, కొడవలి గుర్తుపై, సిపిఎం మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్కు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని, వార్డులోని ఓటర్లను వారు కోరారు.

ఇండియా బ్లాక్ వేదిక తరపున మంగళగిరి నియోజకవర్గానికి సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న జొన్న, గుంటూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ లను గెలిపించాలని కోరుతూ మంగళవారం రాత్రి పట్నంలోని మూడు, నాలుగు వార్డుల్లో ఇన్నింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు ఎస్ వెంకటేష్, ఎస్ గణేష్, టి శ్రీరాములు, కే హనుమంత రెడ్డి, కే ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జంగాల, జొన్నా విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం రాత్రి పట్నంలోని 8, 9, 10 వార్డుల్లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సుత్తి కొడవలి నక్షత్రం, కంకి కొడవలి గుర్తులకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి బాలకష్ణ, గోలి దుర్గాప్రసాద్, ఎస్ నరసింహారావు, డి రామారావు, ఈ విజయలక్ష్మి, టి హేమ సుందర్రావు, సిపిఐ నాయకులు నందం బ్రహ్మేశ్వర రావు, ఏ ప్రభాకర్, పి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో ప్రచారం




రోడ్‌షోలో సిపిఎం కళాకారులు


జొన్నాకు మద్దతు తెలుపుతున్న కాపు జాగృతి, కాపు జెఎసి నాయకులు

జొన్నాకు కాపు జాగృతి, జెఎసి మద్దతు

ప్రజాశక్తి మంగళగిరి :నియోజకవర్గంలోని కాపు సామాజిక వర్గం అంతా ఏకమై ఇండియా బ్లాక్ వేదిక తరపున సిపిఎం పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్ రావును గెలిపించుకోవాలని కాపు జాగృతి, కాపు జెఏసి నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు, కాపు బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు, జనసేన పార్టీ నాయకులు కంకణాల శంకర్, చిట్టెం అవినాష్, కాపు సంఘ నాయకులు కటారి శ్రీనివాసరావు, అంకం కోటేశ్వరరావులను కాపు జెఎసి నాయకులు, జాగృతి జిల్లా కార్యదర్శి జొన్నా రాజేష్, జాగృతి నాయకులు దుర్గా మల్లేశ్వరరావు కలిశారు. శాలువా కప్పి వారిని సత్కరించారు. నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది కాపు సామాజిక వర్గ ఓటర్లు ఉన్నారని ఈ సందర్భంగా కాపు జాగృతి, కాపు జేఏసీ నాయకులు గుర్తు చేశారు. అన్ని పార్టీల్లో ఉన్న కాపు సామాజిక వర్గ నాయకులు జొన్న శివశంకరరావుకు మద్దతు తెలిపాలని అన్నారు. ఇప్పటి వరకు మంగళగిరి నియోజకవర్గం లో కాపు సామాజిక వర్గం నుంచి ఏ ఒక్క నాయకుడు ఎమ్మెల్యేగా గెలుపొందలేదని అన్నారు. జొన్న శివశంకర్ రావు ను గెలిపించి కాపులు ఐక్యతతో తమ సత్తా చాటాలన్నారు. జొన్న శివ శంకరరావు 20 ఏళ్ల పాటు ఉండవల్లి సర్పంచ్ గా సేవలందించారని గుర్తు చేశారు. సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేయించాలని, జొన్న శివశంకర్ రావును గెలిపించాలని కోరారు. కాపు జాగృతి, కాపు జేఏసీ నాయకుల విజ్ఞప్తికి జనసేన పార్టీ, కాపు సంఘాల నాయకులు సుముఖత వ్యక్తం చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తాటికొండ వాసు,గాజుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

దాడిలో క్షతగాత్రులకు యరపతినేని పరామర్శ

ప్రజాశక్తి - గురజాల

దాడిలో గాయపడిన గురజాల మండలం దైదకు చెందిన కలెంకాయల వెంకయ్య, కలెంకాయల శ్రీను, పగడాల వెంకట్రావమ్మను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఎన్‌డిఎ కూటమి తరుపున గురజాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. వీరిపై వైసిపి మూకలు దాడులు చేశాయని, వారి అరాచకాలకు తొందరలోనే తగిన విధంగా బుద్ధి చెబుతామని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో పి.కాంతారావు, టిడిపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కూటమిదే

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని ఎన్‌డిఎ కూటమి తరుపున సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. రాజుపాలెం మండలం అనుపాలెంలో లక్ష్మీనారాయణ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌కు ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, ఆయన చెప్పేవన్నీ అబద్ధాలు, చేసేవి డ్రామాలని అన్నారు. ప్రజలకు మేనిఫెస్టో కరపత్రాలు అందించి ఓట్లు అభ్యర్థించారు. తనతోపాటు నరసరావుపేట ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళ

ప్రజాశక్తి - చిలకలూరిపేట : గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తి రగిలించేటమే కాకుండా వారిలోని మూఢవిశ్వాసాలను తొలగించి ఉద్యమం వైపు నడిపించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని నాయకులు కొనియాడారు. స్థానిక ఎన్‌ఆర్‌టి సెంటర్లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి మంగళవారం ఆయన 100వ వర్ధంతి సందర్భంగా పూలమాలలేసి నివాళులర్పించారు. 27 ఏళ్లకే దేశం కోసం ప్రాణాలర్పించిన ధీరుడు అల్లూరి సీతారామరాజని గుర్తు చేసుకున్నారు. వివిధ సంఘాల నాయకులు బి.శ్రీనునాయక్, బి.చిన్న నాయక్, పి.శ్రీనివాసరావు, డి.డేవిడ్, బి.రాంబాబు నాయక్, కె.నాగేశ్వరరావు, ఆర్.వెంకట్ పాల్గొన్నారు.



కన్నీళ్లతో కొంగుపట్టి ఓట్ల అభ్యర్థన

నారీగళం సమావేశంలో పుల్లారావు భార్య భావోద్వేగం

ప్రజాశక్తి - చిలకలూరిపేట



తన భర్తను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎన్‌డిఎ కూటమి తరుపున చిలకలూరిపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు భార్య కన్నీళ్లతో కొంగుచాపి అభ్యర్థించారు. స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నారీగళం పేరుతో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళల ఆత్మీయ సమావేశంలో పుల్లారావు భార్య వెంకటకుమారి మాట్లాడారు. పాతికేళ్ల ప్రస్థానంలో ప్రతిక్షణం చిలకలూరిపేట ప్రజల కోసమే ఆలోచించిన మనిషిపై గత ఎన్నికల్లో తప్పుడు ప్రచారాలతో అభాండాలు వేశారని అన్నారు. గత ఎన్నికల్లో వైసిపి తప్పుడు ప్రచారం, అబద్ధాలను నమ్మి చేసిన పొరపాటును మళ్లీ చేయొద్దని మహిళలను కోరారు. సమావేశంలో ఇంతమంది మహిళలను చూసిన తర్వాత తనకు ఆనందం, బాధ రెండూ కలిగాయని, అందుకే కన్నీళ్లు ఆగకుండా వచ్చేశాయని చెప్పారు. చిలకలూరిపేటలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని, వారంతా కూటమి అభ్యర్థులకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఒక్క ఛాన్స్ అడిగిన జగన్, అవినీతి మంత్రి రజిని ఏం చేశారో అందరికీ తెలుసని, ఈ విషయాన్ని ఎన్నికల రోజు గుర్తుపెట్టుకుని ఓటేయాలని కోరారు.

ఆట్లేసి.. ఓట్లడిగిన జీవీ భార్య

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్‌డిఎ కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు భార్య లీలావతి రోడ్డు పక్కన దుకాణంలో అట్లేసి ఓట్లడిగారు. పట్టణంలోని ఏడో వార్డులో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎవరెన్ని చేసినా, ఎంతమంది ఎదురొచ్చినా ఈ ఎన్నికల్లో వినుకొండలో గెలిచేది తామేనని చెప్పారు. వైసిపి తప్పుడు ప్రచారాలు, బొల్లా బ్రహ్మనాయుడు అబద్ధపు మాటలపై అప్రమత్తంగా ఉంటూ కూటమి శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని నడిగడ్డకు చెందిన 15 కుటుంబాలు, నీలగంగారానికి చెందిన ఐదు కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరగా వారిని పట్టణంలోని టిడిపి కార్యాలయంలో లీలావతి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మరో ఐదురోజులు విరామం లేకుండా శ్రమిస్తే జూన్ 4న పెద్దఎత్తున సంబరాలు చేసుకుందామని ఈ సందర్భంగా లీలావతి పిలుపునిచ్చారు.




పాస్‌బుక్కుకు రూ.20 వేలు వసూలు చేసిన బ్రహ్మనాయుడు

ఎన్నికల ప్రచారంలో జీవీ ఆంజనేయులు విమర్శ



ప్రజాశక్తి - వినుకొండ

పేదలకు సెంటు స్థలాల పేరుతో ఊరికి దూరంగా 8 కిలోమీటర్ల దూరంలో కొండల్లోని ప్రభుత్వ భూములను ప్రభుత్వానికే అమ్మి సొమ్ము చేసుకున్న దోపిడీదారును, ఒక్కో పాస్‌బుక్‌కు రైతుల వద్ద రూ.20 వేలు గుంజిన గజదొంగను తరిమి కొట్టాలని ఎన్‌డిఎ కూటమి తరుపున వినుకొండ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు కోరారు. శావల్యాపురం మండలం పోట్లూరు, కృష్ణాపురంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. తమ హయాంలో రూ.1000-1200 ఉన్న ట్రక్కు ఇసుక ఇప్పుడు రూ.ఐదారు వేలైందని, రూ.60-70 ఉన్న క్వార్టర్ మద్యం రూ.300 ఎలా పెంచారని ప్రశ్నించారు. పండుగ కానుకలను, అన్న క్యాంటీన్‌లను రద్దు చేశారని, రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. 'బి' టాక్స్ ఎందుకు కట్టాల్సి వస్తోందన్నారు. టిడిపి ప్రభుత్వంలో తాను ఇచ్చిన 12 వేల ఇళ్లు, 28 వేల మరుగుదొడ్లు తప్ప బొల్లా ఒక్కరికైనా అదనంగా మేలు చేశారా. అని ప్రశ్నించారు. గుంతల మయమైన రోడ్లకు తట్ట మట్టి పోయలేదని విమర్శించారు. వందల కోట్లు లూటీ చేసిన అవినీతి ఎమ్మెల్యే బొల్లాను సాగనంపితే త్వరలోనే నదుల అనుసంధానంతో పాటు వాటర్‌గ్రిడ్ కూడా పూర్తి చేసుకుందామని అన్నారు. మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణాలు పూర్తి కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందేనన్నారు. గోదావరి జలాలను నకరికల్లు వద్ద సాగర్ కుడికాల్వలో కలపడం ద్వారా ఇక్కడ రెండు పంటలు పండించుకోవచ్చని చెప్పారు. వినుకొండ శాశ్వత తాగునీటి పథకానికి ఆంజనేయులు గతంలో రూ.159 కోట్లు తెచ్చినా ఈ ఐదేళ్లలో పూర్తి చేయలేని అసమర్థుడు బొల్లా బ్రహ్మనాయుడని విమర్శించారు. ఆయన్ను ఓడించి ఆంజనేయులను గెలిపించాలని కోరారు.



వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : రొంపిచర్ల మండలం కర్లకుంటకు చెందిన 70 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకులు వడ్లమూడి కిషోర్ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని టిడిపి నియోజకవర్గం కార్యాలయంలో కూటమి తరుపున టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా అరవిందబాబు, కిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయాలున్నా వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. నియోజకవర్గ పరిశీలకులు మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అరవిందబాబును, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా పట్టణంలోని 12వ వార్డుకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైసిపిని వీడి అరవిందబాబు సమక్షంలో టిడిపిలో చేరారు.

ప్రతిఒక్కరూ ఓటేయాలని ర్యాలీ

ప్రజాశక్తి - చిలకలూరిపేట : రోటరీ క్లబ్ చిలకలూరిపేట, రోటరీ క్లబ్ పండరీపురం, సిఆర్ కాలనీ వాకర్స్ అసోసియేషన్, చౌదరయ్య హెల్త్‌క్లబ్ వాకర్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఆర్‌టి సెంటర్ నుండి హైస్కూల్ రోడ్డు మీదుగా చౌత్ర సెంటర్ చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. రోటరీ మాజీ అధ్యక్షులు తోటకూర వెంకటనారాయణ మాట్లాడారు. ఎన్‌ఆర్‌టి సెంటర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలేశారు. కె.వెంకటరావు, ఎ.వేమన రెడ్డి, జి.సాంబశివరావు, బి.రామసుబ్బారావు పాల్గొన్నారు.

టిడ్కో గృహ నివాసితులకు పుల్లారావు హామీల వాన



ప్రజాశక్తి - చిలకలూరిపేట

టిడ్కో ఇళ్ల వద్ద నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని, పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి సకల వసతులు కల్పిస్తామని ఎన్‌డిఎ కూటమి తరుపున చిలకలూరిపేట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పత్తిపాటి పుల్లారావుఅన్నారు. గృహ సముదాయం వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన హయాంలో 4500 టిడ్కో ఇళ్లు కడితే జగన్‌రెడ్డి అబద్ధం చెప్పి ఈ ఇళ్లకు డబ్బు కట్టే పనిలేదంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత బ్యాంకులతో మాట్లాడి వాళు టిడ్కో గృహాల లబ్ధిదారుల జోలికి రాకుండా ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంతంలో పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తామని, గృహ సముదాయం చుట్టూ ప్రహరీ, సీసీ కెమెరాలూ పెడతామని, పాఠశాలలు, కళాశాలలకు రవాణా సౌకర్యం కల్పిస్తామని హామీనిచ్చారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అయిన మరుసటిరోజే జూన్ 5న మందు సిట్టింగ్‌లు లేకుండా చేస్తానన్నారు. పండరీపురం నుంచి చెరువు వరకు రెండు లైన్ల రహదారిని వేయిస్తామన్నారు. ఇక్కడ పాములు, తేళ్లు పట్టించడంతోపాటు జంగిల్ క్లియరెన్స్ చేయించి ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పుతామని చెప్పారు.

ఈవిఎంల స్ట్రాంగ్ రూంను పరిశీలించిన పల్నాడు కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈవిఎంలు భద్రపరిచే కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పల్నాడు జిల్లా ఎన్నికలాధికారి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ జి.బిందుమాధవ్ చెప్పారు. నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామ పంచాయతీ పరిధిలోగల జెఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవిఎంలు



భద్రపరిచే స్ట్రాంగ్ రూములను వారు మంగళవారం పరిశీలించారు. అక్కడ ఏర్పాట్లపై సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిచారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను పెంచాలి

ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-గుంటూరు

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుంటున్న ఉద్యోగులు కొంత ఇబ్బందికి గురి అవుతున్నారని, సిబ్బందికి సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెంచాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి సతీష్‌కుమార్ కోరారు. మంగళవారంలో గుంటూరులో పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరు కావాల్సిన ఉత్తర్వుల ప్రకారం అందులో నిర్దేశించిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి భంగపాటుకి గురై అసలైన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయటానికి వెళ్లగా సరియైన ఏర్పాట్లు లేకపోవడం వలన ఉదయం నుండి సాయంత్రం వరకు వేచి ఉండాల్సి వస్తుందని, దీంతో ఎంతో మంది నిరాశకు గురై వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చిందన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో సుమారు 7వేల పోస్టల్ బ్యాలెట్లు ఉంటే, కేవలం మూడు బూతుల ద్వారా ఓటింగ్ ఏర్పాట్లు చేశారన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో 300 ఓట్లు మాత్రమే వేయగలరు అన్నారు. కావున బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరెడ్డి, సుకుమార్, బ్రహ్మారెడ్డి, నగర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సిపిఎం నాయకులు చప్పిడి యాకోబు వర్ధంతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణ సిపిఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు చప్పిడి యాకోబు వర్ధంతి సభ మంగళవారం తాడేపల్లి మేకా అమరారెడ్డిభవన్‌లో జరిగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలీ రేట్ల పెంపు కోసం చట్టంలో పొందుపరిచిన వారి హక్కుల కోసం యాకోబు పాటుపడ్డారని అన్నారు. యాకోబు లేని లోటు తీర్చలేనిదని చెప్పారు. అమరవీరుల ఆశయ స్ఫూర్తితో మతతత్వ బిజెపి, దాని మిత్రులపై పోరాడటమే యాకోబుకు అర్పించే నివాళి అని తెలిపారు. ముందుగా యాకోబు చిత్రపటానికి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, నాయకులు ఎస్.ముత్యాలరావు, డివి భాస్కరరెడ్డి, డి.యోహాన్, అంజిరెడ్డి, వై.బర్నబస్, ఐ.ఇస్సాక్, కోటి, ఎండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా వేదిక అభ్యర్థుల్ని గెలిపించండి

సిపిఎం, సిపిఐ నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - మేడికొండూరు

ఇండియా వేదిక అభ్యర్థుల గెలుపు కోసం మేడికొండూరులో సిపిఎం, సిపిఐ పార్టీల నాయకులు మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. పల్నాడు జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శవర్గ సభ్యులు వై రాధాకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏవివి ప్రసాద్ మాట్లా డుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ప్పటి నుండి ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందన్నారు. ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపిం చు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గుంటూరు పార్లమెంట్ స్థానానికి సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించు కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరాపట్న రామకృష్ణ, మునగోటి శ్రీనివాసరావు, మార్పుల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్ వలి, తాడికొండ మండల కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, కారంపూడి చెన్నకేశవులు పాల్గొన్నారు.


మేడికొండూరులో ప్రచారం

ప్రజాశక్తి-తాడికొండ: ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఐ ,సిపిఎం పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని బండారుపల్లి, గరికపాడు, దామరపల్లి, ఫణిదం, పొన్నెకల్లు, కంతేరు, రావెల , పాములపాడు గ్రామాలలో ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంచాల సుశీల్ రాజాలకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కెవివి బైరం పట్నం రామకృష్ణ ముప్పాళ్ళ శివశంకరరావు, చింతల భాస్కరరావు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని టిడిపి వినతి

ప్రజాశక్తి - తుళ్లూరు

పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆస్తులను వివాదాలల్లోకి నెట్టే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని టిడిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు టిడిపి నాయకులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ప్రజల పరిరక్షణకు తీవ్ర విఘాతంగా పరిణమించే టైటిలింగ్ యాక్ట్ అమలుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అత్యుత్సాహం ప్రదర్శించడాన్ని టిడిపి నాయకులు తప్పుపట్టారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, తెలుగు రైతు సంఘం నాయకులు నూతలపాటి రామా రావు, మాజీ ఎంపిటిసి మైనేని గిరిజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర :ప్రజల ఆస్తులను తాకట్టు



పెట్టుకునేందుకు ప్రభుత్వము ల్యాండ్ టైటిల్ యాక్టు చట్టాన్ని తెచ్చిందని ఆ జీవోను తక్షణమే రద్దు చేయాలని టిడిపి జిల్లా రైతు సంఘం కార్యదర్శి వంగ సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెదేపా శ్రేణులు స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద తమ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి అనంతరం జీవో ప్రతులను చింపివేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భీమవరపు చిన్న కోటిరెడ్డి గుదిబండి గోవర్ధన రెడ్డి బొంతు చంద్రిక లంక కోటిరెడ్డి రఫీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెమ్మసానిని కలవాలంటే వీసా, పాస్పోర్ట్ కావాలి

ప్రజాశక్తి -పొన్నూరు

గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలవాలంటే ప్రతి ఒక్కరూ వీసా, పాస్పోర్ట్ తీసుకోవాలని గుంటూరు వైసిపి పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య వ్యాఖ్యానించారు. మంగళవారం పొన్నూరు మండలం చింతలపూడి లోని మారుపూడి సాయిబాబా స్వగహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తనది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అన్నారు. తన మామగారైన డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు 40 సంవత్సరాలలో రాజకీయంగా అనేక పదవులు చేపట్టి సేవలు అందించారన్నారు. ఆయన అల్లుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి పొన్నూరు ఎమ్మెల్యేగా గెలుపొందడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ స్వగ్రామమైన చింతలపూడిలో పాతికేళ్లలో చేయని విధంగా సుమారు రూ.16 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఈ ఐదేళ్లలో చేశామన్నారు. పట్టణంలో జిబిసి రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులతోపాటు పార్కులు అభివృద్ధి, సిమెంట్ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం పనులు చేశామన్నారు. పేదరిక నిర్మూలనకు సీఎం జగన్ నిజాయితీగా పనిచేశారని చెప్పారు. చంద్రబాబు నిరంతరం ప్రజలను మోసగించుటమే పనిగా పెట్టుకుంటారన్నారు. తనకు, పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి మురళీకృష్ణలకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పలు గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు.



ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 7వ తేదీ వరకు పది రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. చివరి రోజు అభ్యుదయ గీతాలు రాష్ట్ర నాయకులు ఆకురాతి జగన్, డ్యాన్సు లోని ప్రాథమిక మెళకువలు డ్యాన్స్ మాస్టర్ చందు నేర్పించారు. పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిఫికేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి శిక్షణా శిబిరాల్లో పాల్గొనడం ద్వారా పిల్లలకు ఒక గుర్తింపు వస్తుందని చెప్పారు. వారిలోని సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ఉపయోగపడు తుందన్నారు. చిత్రలేఖనం, పాటలు, బెస్ట్ ఫర్ వేస్ట్, డ్యాన్స్ తదితర పది అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. బాల బాలికల్లో భయం పోయి మాట్లాడటానికి చొరవ పెరుగుతుందని చెప్పారు. నీతికథల ద్వారా పిల్లలు సత్ప్రవర్తన కలిగి ఉంటారని, అధ్యయనం ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంధ్యారాణి, రమ, సుధ, వై.బాలకృష్ణ, రమ్య, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పర్యటనను అడ్డుకోవడానికి వైసిపి కుట్ర

ప్రజాశక్తి - పొన్నూరు : సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి పొన్నూరు అసెంబ్లీ అభ్యర్థి నరేంద్ర కుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌లు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ వడ్రాణం మార్కండేయ బాబు జోస్యం చెప్పారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్ పర్యటన అడ్డుకోవటానికి వైసిపి ప్రభుత్వం ప్రయత్నం చేసిందని ఇదిఅప్రజాస్వామ్యం అన్నారు. పవన్ కళ్యాణ్ సభకు జన సమీకరణ చేయలేకపోయారని వైసీపీ నాయకులు విమర్శలు చేయటం వారి అవివేకమని, అన్నారు. పవన్ సభకు అభిమానులు, జనసైనికులు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. ప్రలోభాలకు వైసీపీ నాయకులు లొంగుతారన్నారు.



మాదిగలకు వైసిపిలో గుర్తింపు లేదు

టిడిపి రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్ కుమార్

ప్రజాశక్తి - తెనాలి

నా ఎస్సీ, నా ఎస్టి, నా బిసి అనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నినాదం పూర్తిగా సత్య దూరమని ఆ పార్టీలో మాదిగలకు ప్రాధాన్యత లేదని టిడిపి రాష్ట్ర నాయకులు కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరులో మంగళవారం నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల కేటాయింపులోనే మాదిగలపై తనకున్న చిన్న చూపును వ్యక్తం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని, వర్గీకరణపై సుప్రీంకోర్టులో జరిగిన వాదనలకు ప్రతి రాష్ట్రం నుంచి ప్రభుత్వం తరపున న్యాయవాదులను ఏర్పాటు చేస్తే, కేవలం ఏపీ ప్రభుత్వం మాత్రమే న్యాయవాదిని నియమించలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామంలో ప్రజలు తమ దష్టికి తెచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉన్నం ధర్మారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లో దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఇందుపల్లి రాజారాం, న్యాయవాది సుద్ధపల్లి మురళీధర్, మాస్ అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు, కొలకలూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దళితులకు జగన్ అన్యాయం

మాల సంఘాల జేఏసీ కన్వీనర్ మల్లెల వెంకట్రావు

ప్రజాశక్తి - మంగళగిరి :దళితుల హక్కులు, పథకాలను నిర్వీర్యం చేసి నయవంచన చేసినందుకు జగన్‌ను ఓడించాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ మల్లెల వెంకటరావు అన్నారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైయస్ జగన్ దళితులను మోసగించిన విధా నాలను ప్రజలకు తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 40 మాల సంఘాలు ఎన్నికల్లో టిడిపి కూటమిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుర్రం రామారావు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దోచుకున్న జగన్ కు ఓట్లతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో అంటరానితన నిర్మూలన పోరాట సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి చార్వాకుడు, మాల మహా నాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్ కుమార్, దళిత మహా సభ అధ్యక్షులు కొండపల్లి విల్సన్ పాల్గొన్నారు.



పిరమిడ్ పార్టీని గెలిపించండి

ప్రజాశక్తి - మంగళగిరి

ఆత్మజ్ఞానమున్న మేధావులు మాత్రమే ప్రజలకు సుపరిపాలన అందించగలరని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కట్టా కళాధర్ రెడ్డి అన్నారు. మంగళగిరి నగరంలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కళాధర్ రెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకురాతి శంకర రావు మాట్లాడుతూ 1999లో పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని కుల, మత, వర్గ, వర్ణ, లింగ భేదం లేకుండా నీతి, నిజాయితీతో కూడిన ధర్మ పరిపాలన అందించటమే పార్టీ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 75 అసెంబ్లీ , 15 పార్లమెంట్ స్థానాలకు పోటీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల గుర్తు టెలి విజన్ (టీవీ) అని తెలిపారు. టివి గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని శంకర్రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి దేసు వెంకట నాగలక్ష్మి, దేసు వెంకటరావు, జంజనం శివ నాగరాజు, రామాంజనేయులు, పద్మావతి, కాట్రగడ్డ బాబురావు, లత, దీపాల సాంబశివరావు పాల్గొన్నారు.



నారా లోకేష్ కుటుంబ సభ్యుల ప్రచారం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు ఆలోచించి నారా లోకేష్‌కు ఓటేయాలని ఆయన కుటుంబ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణం 10,11 వార్డులలో మంగళవారం నారా లోకేష్ కుటుంబ సభ్యులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. 13న జరిగే పోలింగ్ రోజు ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్‌ను, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని కోరారు. మహిళలు, ప్రజలు వీరికి అడుగడుగునా ఘన స్వాగతం పలికి హారతులిచ్చారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు. 10వ వార్డులోని కుండల తయారి కేంద్రంలో కుండ తయారు చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ మనవడు గారపాటి శ్రీనివాస్, గారపాటి లోకేశ్వరి, నందమూరి మాధవి మణి, గారపాటి శ్రీనివాస్, కంఠమనేని శ్రీనివాస్ ప్రసాద్, శారదా దుర్గాప్రసాద్, కవిత ప్రసాద్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్రగతి నగర్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మహాత్మాగాంధీ ఇన్నర్ రింగు రోడ్డు, ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వేసవి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను విసా కంప్యూంటర్స్ నిర్వాహకులు అంకమ్మరావు, యుటిఎఫ్ జిల్లా నాయకులు జాన్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రగతి నగర్‌లో ప్రతి సంవత్సరం కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించి, పేద విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించటం అభినందనీయం అన్నారు. కంప్యూటర్ శిక్షణతోపాటు, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించడం వల్ల పిల్లల్లోని సామర్థ్యాన్ని బయటకు తీయటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం చేస్తున్న కార్యక్రమాలను వారు అభినందించారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కె.శ్రీనివాసరావు, కె.వంశీ, బి.సూర్జిత్ పాల్గొన్నారు.

నిజాయితీపరుల్ని ఎన్నుకోండి : జెవివి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకొని, నిజాయితీ పరుల్ని ఎన్నుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు కోరారు. ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించే వారిని, పర్యావరణాన్ని కాపాడే వారిని, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, కల్తీలేని ఆహారం అందించే వారిని, పౌరహక్కులు కాపాడే వారిని, ప్రజల మధ్య సామరస్య భావనను పెంపొందించే వారిని, జాతి సంపదని ప్రజలందరికీ సమానంగా అందేవిధంగా చూసేవారిని, ప్రజారవాణాను ప్రజలందరికీ అందుబాటులో ఉంచేవారిని, ఉపాధి చూపే వారిని, వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దే వారిని, మద్యం, డ్రగ్స్ నిషేధించే వారిని, శాస్త్రీయ ఆవిష్కరణలకు అత్యధిక నిధులు కేటాయించే వారిని, ప్రజల్లో మూఢనమ్మకాలను నిర్మూలించి, శాస్త్రీయ ధృక్పథం పెంపొందించే వారిని ఎన్నుకోవాలని లక్ష్మణరావు కోరారు. ఈ సందర్భంగా ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉండాల్సిన అంశాలపై కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి.వెంకటరావు, బి.శంకర్‌సింగ్, ఎం.ఉదయ్‌భాస్కర్, బి.ప్రతాప్‌సింగ్, టి.ఆర్.రమేష్, ఎస్.కె.సుభాని పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు తదితరులు

అల్లూరి పోరాటాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-గుంటూరు



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటాలు దేశవ్యాప్తంగా విప్లవ ఉద్యమానికి బాటలు వేశాయని, ఆయన త్యాగాలు, విప్లవ పోరాటాలు వర్తమాన, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం) జిల్లా కన్వీనర్ డి.సుధాకర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సందర్భంగా స్థానిక నాజ్ సెంటర్ కూడలిలోని సీతారామరాజు విగ్రహానికి పిడిఎం ఆధ్వర్యంలో దళిత ప్రజా సంఘాలు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ మాట్లాడుతూ నాటి బ్రిటిష్ పాలనను మరిపించే విధంగా బిజెపి సారధ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విస్మరించారు. ఈ విధానాలను ప్రశ్నించిన అడవి బిడ్డలను పోలీసు బలగాలతో క్రూరంగా చంపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.నరసింహారావు, ఎస్.మాల్యాద్రి, టెన్నిస్‌రాయ్, ఎస్.సురేష్, ఏసుబాబు, వి.ముత్తయ్య పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఓటు హక్కుపై చలపతిలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం, ఓటరు ర్యాలీ నిర్వహించారు. ఆర్.రమేష్‌చంద్ర మాట్లాడుతూ ఎన్నికల ద్వారా మంచి భవిష్యత్ కల్పించే నాయకుల్ని ఎన్నుకోవాలని సూచించారు. కె.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ నోడల్ ఆఫీసర్ అధిక ఓటరు భాగస్వామ్యంతో ఏర్పాటు అయిన ప్రభుత్వం ప్రజల అభిష్టాన్ని ప్రతిబింబించి, పాలనను, విధాన రూపకల్పనను మెరుగుపరుస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచటానికి పట్టణప్రాంత ప్రజలు కృషి చేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో స్వీప్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ సిబ్బంది, ఎం.సాంబశివరావు, ది హిందూ స్పెషల్ కరస్పాండెంట్ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జ్ఞానసాగర్

హిందూ ఫార్మసీలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం వేదవిజ్ఞాన అకడమిక్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ వి.జ్ఞానసాగర్ పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా బి.ఫార్మసీ 4వ సంవత్సరం విద్యార్థులకు కరిక్యులమ్ వీటా రెస్యూమ్‌కు ఉన్న తేడా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఇంటర్వ్యూపై చూపించే ప్రభావాన్ని వివరించారు. ఫార్మసీ విద్యార్థులకు ఎలాంటి ఉపాధి అవకాశాలున్నాయి, వాటిని అందిపుచ్చుకోవటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కెఎల్‌యులో శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తాడేపల్లి, మంగళగిరి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్, సైన్స్‌లో శిక్షణిస్తున్నట్లు వర్సిటీ గ్లగ్ ఇంఛార్జి ప్రొఫెసర్ కె.శ్రీపతిరాయ్ మంగళవారం తెలిపారు. 7,8 తరగతులు పూర్తి చేసుకున్న వారికి ఈ నెల 1 నుంచి 10 వరకు శిక్షణ కొనసాగుతున్న శిక్షణకు 200 మంది హాజరవుతున్నారని తెలిపారు. కంప్యూటర్ బేసిక్స్, డిజైనింగ్, లాజిక్ ప్రోగ్రామింగ్‌తో పాటు కథలు చెప్పడం, లాజికల్ రీజనింగ్ తదితర అంశాల్లో శిక్షణిస్తున్నామన్నారు. యూట్యూబ్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన లిటిల్ సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్స్ నుండి శివనాగేశ్వరరావు ఈ శిబిరానికి హాజరై చిన్నచిన్న సైన్స్ సూత్రాలను వివరించారన్నారు. దీంతో పాటుగా మ్యాజిక్‌లో లాజిక్కులు, కథలు చెప్పడం గురించి మంగళగిరి విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ వివరించారన్నారు.

ముస్తాఫాపై అసత్య ఆరోపణలు తగదు

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి
- వైసిపి తూర్పు నియోజకవర్గం అభ్యర్థి నూరిఫాతిమా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



పదేళ్లగా గుంటూరు తూర్పునియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పథకాలను చేపట్టి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే ముస్తాఫాపై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరిఫాతిమా అన్నారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. వివిధ కాలనీల్లో ఆమెకు ఘనస్వాగతం లభించింది. 4 డివిజన్ తమ్మరంగారెడ్డి నగర్, చౌదరి నగర్‌లో ఆమె ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. తనతోపాటు ఎంపీగా కిలారి రోశయ్యను గెలిపించాలని కోరారు. వైసిపి గెలిస్తే ప్రస్తుతం ఉన్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని, టిడిపి వస్తే ఆగిపోతాయని, మహిళలు ఇబ్బంది పడతారని చెప్పారు. వైసిపి సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. చంద్రబాబు నాయుడు తమ పథకాలను తప్పుపట్టి ఇప్పుడు మళ్లీ ఎన్నికల్లో గెలవడం కోసం ఎన్నో హామీలతో మేనిఫెస్టో రూపొందించారని అన్నారు. ఎప్పుడూ మేనిఫెస్టోను ఆమలు చేయని చంద్రబాబు ఈసారి అమలు చేస్తానంటే ప్రజలు ఎవ్వరూ నమ్మబోరని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 25 డివిజన్లలో జరుగతున్న ప్రచారంలో ప్రజాదరణ చూస్తుంటే మళ్లీ వైసిపిని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తనకు నమ్మకం ఉందన్నారు. కార్యక్రమంలో 4వ డివిజన్ కార్పొరేటర్ మెహమూద్, వార్డు ప్రెసిడెంట్ కేసరి సుబ్బులు, కేసరి వెంకట సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, గోపి, రమణరెడ్డి, సౌజన్య, కుమారి, అజీస్, ఖాదర్ పాల్గొన్నారు.



చలమయ్య కాలేజి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీల్లో 40 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకష్ణప్రభు మాట్లాడారు. జాబ్ మేళాలో వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నప్పటికీ చలమయ్య డిగ్రీ కళాశాల విద్యార్థులు 40 మంది వివిధ ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషించదగిన విషయమని అన్నారు. కళాశాల అధ్యక్షులు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ ఎంపికైన వారు ఉద్యోగ విధులు సక్రమంగా నిర్వహించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మాజేటిప్రసాద్, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కళాశాల కోశాధికారి జయప్రకాష్, కర్పూరపు సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎ.శ్రీధర్, ప్లేస్మెంట్ ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.